క్లుప్తంగా

ఎంఈఓ-2గా శ్రీనివాసులు



గాలివీడు : వీరబల్లి మండలం మట్లి పెద్దూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వేల్పుల శ్రీనివాసులు గాలివీడు మండలం ఎంఈఓ – 2గా నియమితులైనట్లు ఉత్తర్వులు వచ్చినట్లు మండల ఎంఈఓ కార్యాలయ సిబ్బంది సోమవారం తెలియజేశారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను క్లాసు రూములలో ఎక్కువ సంఖ్యలో కూర్చోబెట్టి విద్య బోధిస్తున్నారని ఆరోపించారు. తనిఖీలు నిర్వహించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. మారయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు యానాదయ్య మృతి



నందలూరు(రాజంపేట) : మండలంలో సీనియర్ బీసీ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు బయనబోయిన యానాదయ్య(76) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన భార్య లక్ష్మీదేవి టీపీపురం సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. కాగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు మృతుడి కుమారుడు బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్‌ను ఫోన్ ద్వారా పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, యువనాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, మండలపార్టీ కన్వీనరు గోపిరెడ్డి, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గీతాల నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీనేత ఆనాల మధుయాదవ్‌లు ఉన్నారు. కన్నీటి వీడ్కోలు మధ్య యానాదయ్య మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సౌమ్యనాథుని శోభ అనంతం

నందలూరు(రాజంపేట) : నందలూరు సౌమ్యనాథాలయం తిరుమల తిరుపతి దేవస్థానం విలీనం కావడంతో సౌమ్యనాథుని శోభ శిఖరాయమానమని నందలూరు బౌద్ధారామం, శ్రీ సౌమ్యనాథ దివ్యధామం గ్రంథ రచయిత విద్వాన్ డా.గానుగపెంట హనుమంతరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2003లో సౌమ్యనాథచరిత్ర పుస్తకం తీసుకొచ్చానన్నారు. సౌమ్యనాథాలయం చారిత్రక, పౌరాణిక, పర్యాటకపరంగా సుప్రసిద్ధి కోవెల, ఆగమశాస్త్ర రీత్యా ఒక సంపూర్ణాలయమన్నారు. స్వామిదీప్తి అనంతమన్నారు. 1976 నుంచి 1980 వరకు ఐదు సంవత్సరాలు నందలూరు జెడ్పీహైస్కూల్‌లో తెలుగుపండితుడిగా పనిచేశానన్నారు. సంతానంలేని నేను సౌమ్యనాథుని కృపతో కుమారుని పొందగలిగానన్నారు. నందలూరు సౌమ్యనాథస్వామి దయతో భారత రాష్ట్రపతితో అవార్డులు మరెంతో కీర్తిప్రతిష్టలు పొందగలిగానన్నారు. సౌమ్యనాథాలయంను టీటీడీ విలీనానికి కృషిచేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలియజేశారు.

వినియోగదారులే దేవుళ్లు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : వినియోగదారులే దేవుళ్లని మెప్మా రాష్ట్ర ప్రతినిధి (జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ సభ్యురాలు) హిమబింధు రెడ్డి జగనన్న మహిళా మార్ట్ నిర్వాహకులకు చెప్పారు. సోమవారం ఆమె జగనన్న మహిళా మార్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె నిర్వాహకులతో మాట్లాడుతూ కస్టమర్లకు కావాల్సిన నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అందివ్వాలని సూచించారు. అలాగే నిర్వహణలో ఎప్పటికప్పుడు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి మెప్మా అధికారి అబ్బాస్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడను సందర్శించిన మెప్మా రాష్ట్ర ప్రతినిధి

వీరబల్లె (రాయచోటి టౌన్): వీరబల్లె మండలం గుర్రప్పగారిపల్లెలోని బెజవాడ దళితవాడను మెప్మా రాష్ట్ర ప్రతినిధి హిమబింధురెడ్డి సందర్శించారు. సోమవారం ఆ గ్రామానికి చేరుకున్న ఆమె అమ్మవారి గుడిలో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదాని అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్న తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు ఈశ్వరయ్య, సుబ్బరామరాజు, శ్రీరాముల రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అన్ని వీధులను అభివృద్ధి చేస్తాం

- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి అర్బన్: మైనార్టీ మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందివ్వాలన్నదే సీఎం జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ పరిధిలోని 30, 31 వార్డులలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. 30, 31 వార్డులలోని యూసుఫ్ షా నగర్, బండ్లపెంట దర్గా, నాయబ్ సాహెబ్‌వీధి, మార్కెట్ వీధి, బిరాంసాహెబ్ వెనుక వీధులలో ఆయన కలియ తిరిగారు.

మైనార్టీ మహిళల హర్షం

వైఎస్ఆర్ చేయూత పథకం 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పేద మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు వరంలాంటిందని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట మైనార్టీ మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అక్కాచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. చేయూత ద్వారా మహిళలకు ఆర్థికంగా, తోడుగా నిలవడం ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక పరిస్థితులు పూర్తిగా మార్చివేసే దిశగా అడుగులు వేస్తుండడం సంతోషదాయకం అన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేయాలి..

పట్టణంలో పారిశుధ్యం పనులను మరింత ముమ్మరంగా చేపట్టాలని అధికారులకు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. చెత్తసేకరణ వాహనం ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే కార్యక్రమం ముమ్మరంగా సాగాలన్నారు. కార్యక్రమంలో ఆయా వీధుల ప్రజలతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మమేకమయ్యారు. వారి సమస్యలు వింటూ పరిష్కారమార్గం చూపుతూ ముందుకు సాగారు. తమకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా సహాయం అందిందని బండ్లపెంటకు చెందిన పఠాన్ అఫ్సర్ ఖాన్, సయ్యద్‌బీబీజాన్, అమీనాబిల కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు. దివాన్ సాహెబ్ దర్గా దగ్గర వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే సందర్శించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా శుద్ధ జలాన్ని అందించాలంటూ ప్లాంటు నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ముస్లిం, మైనార్టీ ప్రజాప్రతినిధులతో కలసి బండ్లపెంట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా, సంతోషంగా ఉండాలంటూ ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు హబీబుల్లాఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్‌లు ఆసిఫ్ అలీఖాన్, గౌస్‌ఖాన్, ఈశ్వర్, కొలిమి చాన్‌బాషా, జయన్ననాయక్, సాదక్‌అలీ, అల్తాఫ్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేత

లక్కిరెడ్డిపల్లె : జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరాం పురుషోత్తంల చేతుల మీదుగా రాయచోటి నియోజకవర్గ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినీ సాయి సుజితకు రూ. 5 వేలు నగదు మెడల్, మెమెంటో ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. అలాగే విద్యార్థిని తండ్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఏడీ ప్రసాద్ బాబు, ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మురళీ నాయక్, పీడీ సోమశేఖర్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయచోటి : పేదలకు కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. చిన్నమండెం మండలం టి.చాకిబండకు చెందిన బుడ్డా నారాయణకు రూ.1.80 లక్షలు, లక్కిరెడ్డిపల్లె మండలం బ్రాహ్మణ ఎర్రగుడి కొండావాండ్లపల్లెకు చెందిన కొండా ఓబుల్‌రెడ్డికి రూ. 1 లక్షలు, రామాపురం సుద్దమల్లకు చెందిన రాజారెడ్డికి రూ. 2 లక్షలు, గాలివీడు మండలం పెడకంటి కొత్తపల్లెకు చెందిన బండి నాగిరెడ్డికి రూ. 4 లక్షల చెక్కులను శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే, సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు.

విజిలెన్స్ ఏఎస్పీగా ఎస్.మాసూమ్ బాషా



ఎస్పీ గంగాధర్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ మాసుమ్ బాషా

రాయచోటి : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల విజిలెన్స్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్. మాసూమ్ బాషా అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావును కలిశారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలి

స్పందన ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలని ఎస్పీ గంగాధర్ రావు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఎస్పీ సూచించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.

జగనన్న సురక్షను పకడ్బందీగా నిర్వహిద్దాం

నందలూరు(రాజంపేట) : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ పరిధిలో పకడ్బందీగా నిర్వహిద్దామని ఎంపీడీఓ సౌభాగ్య పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు సచివాలయాల వారీగా షెడ్యూలు విడుదల చేస్తామన్నారు. వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ప్రధానంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో కీలకపాత్ర వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు అవసరమైన తొమ్మిది అంశాలకు సంబంధించిన పత్రాలను జారీ చేసేందుకు సర్వం సిద్ధం చేసుకోవాలన్నారు. జనన, మరణ, కుల, ఆదాయం, మ్యారేజ్, ఫ్యామిలీ సర్టిఫికెట్స్ ఇవ్వాలన్నారు. కౌలురైతుకు సంబంధించి, ఆధార్ మొబైల్ లింక్ లాంటి వాటికి సంబంధించి సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి వలంటీర్లకు యాప్ కూడా ఉంటుందని, అందులో వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 23 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో తహసీల్దారు వైఎస్ సత్యానందం, డిప్యూటీ తహసీల్దార్ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో...

సిద్దవటం : జగనన్న సురక్ష అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్షించినట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దారు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు, పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వలంటీర్లు ఇంటింటికి వెళ్లాలన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలన్నదే లక్ష్యం

- సంక్షేమ పథకాలలో మగువలకే అగ్రతాంబులం
- గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాఘవరాజుపురం దళితవాడలో ఆర్‌వి.రమణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకుని ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరించారు. మాట తప్పని, మడమ తిప్పని మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను చేసి చూపిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలను తన పాదయాత్ర సమయంలో తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేసి చూపిస్తున్నారని కొనియాడారు. వైఎస్ జగన్‌కు మీరంతా బాసటగా నిలవాలని, ఆయనకు మీ అందరి దీవెనలు, ఆశీర్వాదాలు అందజేయాలని, మళ్ళీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందుతోందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం రూపొందించారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి పేదవారికి గృహాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి, అన్నిశాఖల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, తహసీల్దారు రామ్మోహన్, ఈఓపీఆర్డీ నాగార్జున, సీహెచ్.రమేష్, ఎంపీటీసీలు జనార్దన్‌రాజు, మల్లికార్జునలు, వైఎస్ కరీముల్లా, ఆజాద్, నిమ్మకాయల మోహన్‌రెడ్డి, కోటి, రామ్మూర్తి, చెన్నయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి

పెనగలూరు : మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు సోమవారం కొండూరు రైతు భరోసా కేంద్రంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు ఉద్యానశాఖ అధికారి సురేష్ బాబు తెలిపారు. రైతులతో ఆయన మాట్లాడుతూ మామిడి తోటలలో కాయలు కోసిన అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలు గురించి ఆయన వివరించారు. కోత అనంతరం చెట్లకు 15 నుంచి 20 రోజులపాటు విశ్రాంతి ఇచ్చి ఆ తరువాత కొమ్మలను కత్తిరించాలన్నారు. గుబురుగా పెరిగే చెట్లలో సూర్యరశ్మి, గాలి, వెలుతురు చెట్టులోనికి ప్రవేశించేలా పై కొమ్మలను తూర్పు, పడమర దిక్కుల వైపున కత్తిరించాలన్నారు. కొమ్మలు కత్తిరించిన వెంటనే చెట్టు మొత్తం తడిసేలా కాపర్ ఆక్సీక్లోరైడ్ 100 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రతి చెట్టుకు 50 కిలోల పశువుల ఎరువు, ఒక కిలో యూరియా, 5 కేజీలు సూపర్ పాస్పేట్, 750 గ్రాముల పొటాషియం వేసి మట్టిలో కలిపి నీరు పెట్టాలన్నారు. వర్షం కురిసిన వెంటనే అడ్డంగా దున్ని జనుము, జీలుగ, పిల్లిపెసర చల్లితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వంశీ, మల్లేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడకు స్మశాన స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

చిట్వేలి : మండల పరిధిలోని బాలాజీనగర్ దళితవాడకు స్మశాన వాటికను కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్ శిరీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సీపీఐ కార్యదర్శి తిప్పన ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు ఏర్పాటు అయినప్పటి నుంచి స్మశాన వాటిక లేక దళితవాడ వాసులు అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్ బాలాజీ నగర్ దళితవాడతో పాటు దానిచుట్టు పక్కల మరో నాలుగు గ్రామాలకు స్మశానవాటికను కేటాయిస్తామని హామీ ఇచ్చారని ప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మండలంలోని రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన తహసీల్దర్ పుల్లారెడ్డిని సాయికిషోర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, ఎంపీటీసీ దుర్గప్రసాద్, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, వైఎస్సార్ పార్టీ నాయకులు సానుగారి సుబ్బారెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో రాయచోటి విద్యార్థికి 18వ ర్యాంక్

రాయచోటి టౌన్ : జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో రాయచోటి విద్యార్థి కొండా పుష్పకుమార్‌రెడ్డి జాతీయ స్థాయి 18వ ర్యాంక్ సాధించాడు. రామాపురం మండలం వసంతవాండ్లపల్లెకు చెందిన సురేంద్రారెడ్డి, కవిత ల కుమారుడు కొండా పుష్పకుమార్‌రెడ్డి. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు రాయగా ఆల్ ఇండియా స్థాయిలో 495 మార్కులతో 18వ ర్యాంక్ సాధించాడు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదవాలన్నదే తన లక్ష్యమని చెప్పాడు.

ముంపువాసులకు నష్టపరిహారం చెల్లించాలి

రాయచోటి అర్బన్ : శ్రీనివాసపురం ముంపువాసులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాయచోటి ఏరియా కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రిజర్వాయర్ ముంపువాసులతో కలసి నష్టపరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న శ్రీనివాసపురం రిజర్వాయర్ ముంపువాసుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వాలు మారినా వారికి న్యాయం జరగడం లేదన్నారు. ముంపువాసుల కోసం స్థలాలు కేటాయించిన కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజి కింద ముంపు వాసులందరికి నష్టపరిహారం రూ.15 నుంచి 20 లక్షల వరకు చెల్లించాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతులు రాజగోపాల్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రమేష్‌బాబు, సురేష్‌బాబు, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థి సత్తా

రామాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలో గంపా ధనుష్ మొదటి ర్యాంకు సాధించినట్లు బీసీ కాలనీ ఉపాధ్యాయుడు విశ్వనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం బీసీ కాలనీలో 5వ తరగతి చదివి 6వ తరగతి ప్రవేశం కోసం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ప్రవేశపరీక్షలో మొదటి ర్యాంక్ సాధించాడన్నారు. పాఠశాల నుంచి మరో 11 మంది ఆదర్శ పాఠశాలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. బీసీ కాలనీ పాఠశాల నుంచి విద్యార్థులు సాధించిన ఘనతను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

పెనగలూరులో..

పెనగలూరు : ఇటీవల ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో సాయి భార్గవ్‌కు టాప్ ర్యాంకర్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. వందసీట్లకు గాను 195 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 187 మంది పరీక్షకు హాజరయ్యారని, వారిలో సాయి భార్గవ్ వంద మార్కులకు గాను 96 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారన్నారు. ఎగువ సిద్దవరం గ్రామానికి చెందిన గాదెల సాయిభార్గవ్ టాప్ ర్యాంకర్‌గా నిలిచాడన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి



సంబేపల్లె: బహుమతులు అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి



పుల్లంపేట: నగదు అందజేస్తున్న ఎంపీపీ బాబుల్ రెడ్డి



సిద్దవటంలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం



పెనగలూరు మండల కేంద్రంలో..

సంబేపల్లె : విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు ఐక లక్ష్యం ఏర్పాటు చేసుకొని చదవాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేవపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జగనన్న ఆణిముత్యాల కింద బహుమతులను అందజేశారు. గురువులను విద్యను అభ్యసించాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

పుల్లంపేట : విద్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు ద్వారా నగదు అందజేశారు. ప్రథమ స్థానం లక్ష్మీ అక్షయ, ద్వితీయ స్థానం లక్ష్మి, తృతీయ స్థానం బ్రాహ్మణిలు సాధించగా వీరికి వరుసగా రూ. 3 వేలు, రూ. 2 వేలు, వెయ్యి రూపాయల నగదు, ప్రశంసా పత్రాలను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహ కుమార్, ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

సిద్దవటం : ప్రతి విద్యార్థి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు, వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని బెటాలియన్‌లోని జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ జాఫర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బి.వెంకటప్రవీణ్ 561 మార్కులతో మొదటి స్థానంలో, పి.ఆయేషాఖానం 524 మార్కులతో రెండవ స్థానంలో, పి.వెంకటసాయిక్రిష్ణ 522 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచారన్నారు. వీరికి మొదటి బహుమతిగా రూ. 3000, రెండవ బహుమతిగా రూ. 2000, మూడవ బహుమతిగా రూ.1000 నగదు, మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రధానోపాధ్యాయుడి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రదానం చేశారు.

పెనగలూరులో..

పెనగలూరు : విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని చక్రంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం చక్రంపేట హైస్కూల్‌లో పదోతరగతిలో మొదటి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పేరిట నగదు పారితోషకం అందజేశారు. మొదటి స్థానం సాధించిన వారికి రూ. 3 వేలు, ద్వితీయ స్థానం రూ. 2 వేలు, తృతీయస్థానం సాధించిన విద్యార్థులకు వెయ్యి రూపాయల నగదును అందించారు.

'జగనన్నకు చెబుదాం' ఓ బృహత్తర కార్యక్రమం

ఒంటిమిట్ట : జగనన్నకు చెబుదాం ఓ బృహత్తర కార్యక్రమం అని మండల ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామ సచివాయలంలో ఎంపీడీఓ రెడ్డయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురేష్ కుమార్ హాజరయ్యారు. కొత్తమాధవరం గ్రామ పంచాయతీలోని సమస్యల గురించి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలపై వినతులు కూడా తీసుకున్నట్టు ప్రత్యేక అధికారి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవీలత, మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు

రాజంపేట : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను చూపిన వారిని ఆదర్శ ఉద్యోగులుగా గుర్తిస్తూ, వారికి క్యాష్ అవార్డులను ఇవ్వడం జరుగుతోందని రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు రమణయ్య అన్నారు. సోమవారం డిపో సెక్యూరిటీ బ్రాంచి ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించి, మాట్లాడారు. డిపో అభివృద్ధికి కండక్టర్, డ్రైవర్ల కృషి ప్రధానమైనదన్నారు. ఫిరోజ్ అనే డ్రైవరు 166 లీటర్ల డీజల్ మిగిల్చి, 6.96 కెఎంపీఎల్ తీసుకొచ్చారన్నారు. ఇందుకు ఆయనకు రూ.500 క్యాష్ అవార్డు, ఏపీ సాహెబ్ 6.52 కెఎంపీఎల్ తీసుకొచ్చారన్నారు. ఆయనకు రూ.300 క్యాష్ అవార్డుతో సత్కరించామన్నారు. కండక్టర్‌గా కెఆర్‌జీనాయుడు, బెస్ట్ సూపర్‌వైజరుగా ఎల్‌ఈరెడ్డి (టీఐ–2)లు ఉత్తమ ప్రతిభను కనబరిచారన్నారు.

శివాలయంలో పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీభుజంగేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.